రైతులపాలిట 'భయ'హస్తం

మొదటిపేజీ తరువాయి...

దర్శనమిస్తున్నాయి. పండించిన పంటను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయక పోవడంతో దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ సర్కారులో ఆర్థిక భరోసాతో సగర్వంగా బతికిన రైతులకు కాంగ్రెస్ పాలనలో మళ్లీ కన్నీళ్లు, కడగండ్లు, ఆందోళనలు, ఆత్మహత్యలు తప్పడం లేదు.

అన్నదాతలకు ఆలంబన.. కేసీఆర్ పాలన

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఆరేండ్ల పాటు రైతుబంధు పథకాన్ని నిర్విఘ్నంగా ఇచ్చింది. 65లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చింది. కానీ రైతుభరోసా పేరుతో ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన కాంగ్రెస్ ఉన్న రైతుబంధును కూడా అటకెక్కించింది. రైతులు పెట్టుబడి కోసం మళ్లీ వడ్డీ వ్యాపారుల ముందు మోకరిల్లాల్సిన దుస్థితి కల్పించింది. రైతుబంధు కింద కేసీఆర్ సర్కారు పదకొండు పంటలకు అన్నదాతల ఖాతాల్లో రూ.72,808 కోట్లు జమ చేసింది. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నిరుడు డిసెంబర్‌లో యాసంగి పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. బీఆర్ఎస్ పోరాటంతో పంట కోతల సమయంలో ఆగస్టులో పంపిణీ చేసింది. ఈ ఏడాది వానకాలం రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టింది.

తూతూమంత్రంగా రుణమాఫీ

అధికారంలోకి వస్తే డిసెంబర్ 9న రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక హామీని తుంగలో తొక్కింది. 70లక్షల మంది రైతులకు రూ.50వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉన్నప్పటికీ షరతులు, కోతలు పెట్టి రైతుల సంఖ్యను 42లక్షల మందికి, మాఫీ మొత్తాన్ని రూ.31వేల కోట్లకు తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలయాపన చేసి, నాలుగు విడతల్లో 25.35 లక్షల మంది రైతులకు రూ. 20,616 కోట్లు మాత్రమే మాఫీ చేసింది. ఇంకా 16.65లక్షల మంది రైతులకు చేయాల్సిన రూ.10,384 కోట్ల రుణమాఫీపై ప్రభుత్వం నుంచి స్పష్టతలేదు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసింది. రెండు విడతల్లో కలిపి 58.29 లక్షల మంది రైతులకు రూ. 29,144 కోట్ల రుణాలు మాఫీ చేసింది. కాంగ్రెస్ పాలనలో మళ్లీ క్యూలైన్లు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిల్చున్న దుస్థితిని చూశాం. కానీ పదేండ్ల కేసీఆర్ పాలనలో ఈ అవస్థలు లేవు. కేసీఆర్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో సీజన్‌కు ముందే రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మళ్లీ ఎరువులు, విత్తనాల కోసం క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి.

రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర వద్ద కామారెడ్డి-కరీంనగర్ రహదారిపై ధాన్యం పోసి నిరసన తెలుపుతున్న రైతులు

మళ్లీ అన్నదాతల ఆత్మహత్యలు

ఉమ్మడి ఏపీలో వ్యవసాయం కుదేలవడంతో రైతులు సంక్షోభంలో కొట్టుమిట్టాడారు. అప్పుల ఊబిలో నుంచి బయటపడే దారిలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. జాతీయ నేర గణాంకాల సంస్థ-ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం 2014లో 1347 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న రైతు సంక్షేమ చర్యలతో 2023 నాటికి ఆత్మహత్యల సంఖ్య 121కి తగ్గింది. ఈ విధంగా రైతుల ఆత్మహత్యలు 11శాతం నుంచి 1.57శాతానికి తగ్గాయి. ఇక ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ ఆత్మహత్యలు పెరిగిపోయాయి. ప్రధాన పత్రికల్లో వచ్చిన వివరాల ప్రకారం గడచిన 11 నెలల్లో 347 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ప్రతిపక్ష బీఆర్ఎస్, రైతుల సంఘాలు చెప్తున్నాయి.



కరెంట్ కోతలు.. ఎండిన పంటలు

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందో లేదో మళ్లీ కరెంట్ కోతలు మొదలయ్యాయి. నిరుడు యాసంగిలో ఎడాపెడ కరెంట్ కోతలతో వ్యవసాయం ఆగమైంది. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోయాయి. మళ్లీ రాత్రిపూట కరెంట్‌తో పలువురు రైతులు షాక్‌తో చనిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రణాళిక లేకపోవడంతో యాసంగిలో పంటలు ఎండిపోయాయి. ఉమ్మడి నల్లగొండలో రైతులు అనధికార క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వచ్చింది.

పంటలు కొనే దిక్కేది!

రైతులు పండించిన ప్రతీ పంటను బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర అందించేది. వడ్లు, మక్కలు, జొన్నలు, పత్తి ఇలా ఏ పంటైనా ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 7.37 కోట్ల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. కానీ కాంగ్రెస్ పాలనలో రైతులు పంటలను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు పెడుతుండడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ప్రభుత్వంపై ఆశలు సన్నగిల్లి నష్టాలకు దళారులకు అమ్ముకుంటున్నారు. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ 20 లక్షల టన్నులు కూడా ధాన్యం కొనుగోలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది.

సంవత్సరం	రైతుబంధు మొత్తం
2018-19	రూ.10,488
2019-20	రూ.10,532
2020-21	రూ.14,646
2021-22	రూ.14,772
2022-23	రూ.14,745
2023	రూ.7,625(వానకాలం)
మొత్తం	రూ. 72,808

ధాన్యం కొనుగోలు వివరాలు(లక్షల టన్నులు)

సంవత్సరం	ధాన్యం
2014-15	24.28
2015-16	23.57
2016-17	54.07
2017-18	54.08
2018-19	77.48
2019-20	111.25
2020-21	141.02
2021-22	120.60
2022-23	130.83
2023	95.34
మొత్తం	7.37 కోట్ల టన్నులు

లగచర్ల, పోలేపల్లిలో పారిశ్రామికవాడ

మొదటిపేజీ తరువాయి...

ఏమైనా సందేహాలుంటే నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా కలెక్టర్ కార్యాలయంలో అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని సూచించారు.

ఫార్మా భూసేకరణను వ్యతిరేకించిన రైతులు

దుద్యాల మండలం హకీంపేట, పోలేపల్లి, లగచర్ల పరిధిలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు తొలుత ప్రభుత్వం 1358.37 ఎకరాల అసైన్డ్/పట్టా భూముల సేకరణ ప్రక్రియను రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. రైతుల ప్రతిఘటనతో గతంలో ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. తాజాగా లగచర్ల, పోలేపల్లిలో భూసేకరణకు మరో నోటిఫికేషన్ విడుదలైంది. భూ వినియోగం మారిన ప్పటికీ భూసేకరణ యత్నాన్ని ప్రభుత్వం వీడలేదని తేలింది. గతంలో ఫార్మా కోసం భూసేకరణ చేపట్టగా, తాజాగా పారిశ్రామికవాడ పేరుతో భూసేకరణకు ఒడిగట్టడం గమనార్హం.

5న చలో బస్‌భవన్

- **టీజీఎస్ఆర్టీసీ జేఏసీ పిలుపు**

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ఈ నెల 5న చలో బస్‌భవన్‌కు పిలుపునిచ్చింది. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ గత ప్రభుత్వం గెజిట్ విడుదల చేసి ఏడాది అయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కారు ఇంతవరకు అపాయింటెడ్ తేదీ ప్రకటించకపోవడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ హఠాన్మరణం

- **సీపీఐ రాష్ట్ర నాయకుల సంతాపం**

జవహర్‌నగర్, నవంబర్ 30: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బాలమల్లేశ్ శనివారం హైదరాబాద్‌లో ఆకస్మికంగా మృతి చెందారు. గుండెపోటుకు గురైన బాలమల్లేశ్ ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కలకొండ కాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వయస్సు 58 కాగా, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాలమల్లేశ్ యాదవ్ చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు భావాల పట్ల ఆకర్షితుడయ్యాడు. విద్యార్థి నేతగా, ఆపై పార్టీ నాయకుడిగా పనిచేశారు. పేద ప్రజలు నివసించే జవహర్‌నగర్‌తో బాలమల్లేశ్‌కు విడదీయలేని బంధం ఉందని పార్టీ నాయకులు తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని మగ్ధూంభవన్‌లో ఉంచుతామని, అనంతరం ఆదివారం యాప్రాల్‌లోని తన నివాసం నుంచి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాలమల్లేశ్ మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని తదితరులు సంతాపం తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు?

- **జనవరి 26తో పాలకవర్గాల గడువు పూర్తి**

హైదరాబాద్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): వచ్చే జనవరిలో పాలకవర్గాల గడువు ముగియనున్న మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీల పాకవర్గాల గడువు జనవరి 26తో ముగియనున్నది. మరో ఐదు మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. మొత్తంగా 135 మున్సిపాలిటీలకు ఎన్నికలు అనివార్యం అవుతుంది. ఈ దశలో వచ్చే జనవరి రెండో వారంలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం నుంచి హింట్ వచ్చింది. మరోపక్క బీసీ కులగణన ప్రక్రియ కొనసాగుతుండగా, బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం నుంచి క్లారిటీ రావాల్సి ఉన్నది.

కూడికలూ రాకపాయె!

- **అబద్ధాల్ని కూడా సరిగ్గా ప్రాజెక్ట్ చేయలేకపోయిన కాంగ్రెస్**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): అబద్ధం ఆడితే అతికినట్టు ఉండాలంటారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అది కూడా చేతకావట్లేదు. 'రైతు పండుగ' పేరిట ఏడాదిలో వ్యవసాయానికి రూ.54,280 కోట్లు ఖర్చు చేశామని పత్రికల్లో శనివారం ఫ్రంట్ పేజీలో ఫుల్‌పేజీ ప్రకటనలు గుప్పించింది. ఇక్కడే ప్రభుత్వం తప్పులో కాలేసింది. ప్రకటనలో చూపిన విలువకు, ఆయా విషయాల్లో ఖర్చు చేసిన లెక్కకు పొంతన కుదరలేదు. ఐదు వేల కోట్లు తేడా ఉండటంతో 'కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడికలూ రాకపాయె' అంటూ నటరాజ్ అనే నెటిజన్ కామెంట్ చేశాడు. 'అబద్ధాలనూ సరిగ్గా చెప్పడం రాదా?' అని కిరణ్ ఎద్దేవా చేయగా, 'మీరు చెప్పిన లెక్కల్లో ఏది నిజం' అంటూ ప్రవీణ్‌రెడ్డి కామెంట్ చేశాడు. సీఎంను ఉద్దేశిస్తూ ఢిల్లీకి వెళ్లే హెలికాప్టర్ చార్జీల్లో కలిపేశారేమో అంటూ సాయిప్రసాద్‌రావు అనే మరో నెటిజన్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

డబ్బులు ఏపీ ఇచ్చినప్పుడే తీసుకుందాం

- **టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుపై ఇరిగేషన్ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీకి సంబంధించిన ఉమ్మడి సాగునీటి ప్రాజెక్టుల ఔట్‌లెట్లపై టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు అయ్యే ఖర్చును ఇరు రాష్ట్రాలు భరించాల్సి ఉన్నది. కానీ, టెలిమెట్రీ వ్యవస్థలను వెంటనే అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రస్తుతం ఆ మొత్తం నిధులను తెలంగాణ ప్రభుత్వమే భరించాలని, ఏపీ ఇచ్చినప్పుడు రీయింబర్స్ చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నీటి వినియోగం విషయంలో జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై శనివారం ఆయన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కృష్ణా గోదావరి జలాలపై కొనసాగుతున్న అంతర్రాష్ట్ర వివాదాలు, నీటి వాటాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలను దక్కించుకోవాలని, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా ట్రిబ్యునల్ ఎదుట సమర్థంగా వాదనలు వినిపించాలని ఆదేశించారు. వాటాల పంపిణీ పూర్తయ్యే బోర్డుల జోక్యానికి తావులేకుండా చూసేలా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని అధికారులకు సూచించారు. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టుల ద్వారా ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటున్నదో లెక్కలు తీయాలని, శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, బనకచెర్ల హెడ్ రెగ్యులేటరీ, తెలుగుగంగ, కేసీ కెనాల్, హంద్రీ నీవా, గాలేరు నగరి, వెలుగోడుల నుంచి ఏపీ ఎంత నీటిని తరలిస్తున్నదో రికార్డు చేయాలన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ వైద్యనాథన్, ఏజీ సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ ఏజీ రజనీకాంత్‌రెడ్డి, సలహాదారు ఆదిత్యనాథ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

- **డెడికేటెడ్ కమిషన్‌కు పద్మశాలి సంఘం వినతి**

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు రాష్ట్ర పద్మశాలి సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌ను మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో సంఘం నేతలు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు వలకటి రాజకుమార్, నేతలు గుంటి నగేశ్, గంజి శ్రీనివాస్, మేకల జయరాములు, బింగి నవీన్‌కుమార్, మామిడాల సంపత్, మేకల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్ట్ పరీక్షకు 90% హాజరు

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి శనివారం రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష నిర్వహించారు. 732 పోస్టులకు 27,101 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 24,578 మంది(90.69 శాతం) హాజరైనట్టు అధికారులు తెలిపారు.

పీఆర్టీయూ 'ఎమ్మెల్సీ'కి బీటీఏ మద్దతు

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులకు బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) మద్దతు ప్రకటించింది. రెండు నియోజకవర్గాల నుంచి పోటీచేస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామని ప్రకటించింది. శనివారం నారాయణగూడ పీఆర్టీయూ టీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కే చైతన్య, ప్రధాన కార్యదర్శి ఎం గంగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం సంతోష్‌నాయక్ మద్దతు లేఖను పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డికి అందజేశారు.

ఫార్మా విలేజ్ రద్దును స్వాగతిస్తున్నాం: కూనంనేని

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): లగచర్లలో ఫార్మా విలేజ్‌ను రద్దు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఫార్మా విలేజ్ స్థానంలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ కారిడార్ కోసం పంట తక్కువగా పండే భూములను సేకరించాలని సూచించారు. ఈ విషయంలో రైతులను బలవంతపెట్టవద్దని కోరారు.

రైతు పండుగ కాదు.. బెదిరింపు సభ

- **మీరు భూములు ఇవ్వకున్నా నేను గుంజుకుంటానని బెదిరించినట్టుంది**
- **రేవంత్‌కు పాలమూరుపై ధ్యాసే లేదు**
- **ప్రసంగం అంతా ఆత్మస్తుతి, పరనింద**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ అమిస్తాపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించింది రైతు పండుగ సభ కాదని, రైతులను బెదిరించే సభ అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కొడంగల్‌లో భూములివ్వకుండా గిరిజన రైతులు ఎదురు తిరిగారని, ఆ కక్షతో రాష్ట్రంలోని రైతులందరినీ బెదిరించేందుకే ఈ సభ పెట్టినట్టుగా ఉన్నదని ధ్వజమెత్తారు. 'మీరు ఇవ్వకున్నా నేను గుంజుకోవడం ఖాయం' అని రేవంత్ బహిరంగంగా బెదిరించినట్టున్నదని మండిపడ్డారు. పాలమూరు మీద ప్రేమ ఉంటే ఏడాది కాలాన్ని ఎందుకు హారతి కర్పూరంలా కరిగించావని సీఎంను ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిలో ఎక్కడా కూడా పాలమూరు తపన, ధ్యాస, వేదన ప్రజలకు కనిపించలేదని పేర్కొన్నారు. 'రేవంత్ సీఎం అయ్యాక ఏడాది పాలనలో పాలమూరు జిల్లాలో తట్టెడు మట్టి ఎత్తింది లేదని ధ్వజమెత్తారు. పాలమూరు వలసలకు కారణమే కాంగ్రెస్ పాలన అని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు పచ్చబడిందని తెలిపారు.

భూములు ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

పోతే మన కుటుంబాలు ఆగమయితయి. ఇయ్యాల పది ఎక్కువ తీసుకొని పక్కకుపోయి భూములు కొనుక్కోండి. ఉద్యోగం తీసుకోండి. మీ కుటుంబాలను బాగుపర్చుకోండి' అంటూ రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. 'ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, ఎవరు అడ్డం వచ్చినా తొక్కుకుంటూ పోయి పాలమూరు జిల్లాకు నిధులు తెస్తా, నీళ్లు పారిస్తా.. కొడంగల్‌లో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తా.. అది నా జిమ్మేదారి' అంటూ ఊగిపోయారు. 'నన్ను మారుమూల ప్రాంతమైన కొడంగల్ నుంచి ఆశీర్వదించినందుకు ఆ ప్రాంతానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలని 3 లక్షల ఎకరాలు ఆ ప్రాంతంలో ఉంటే.. 1300 ఎకరాలు సేకరించి ఇండస్ట్రియల్ పార్క్ తెచ్చి 20 వేలో.. 30 వేలో.. మా కొడంగల్‌లో ఉన్న నిరుద్యోగ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, నా ప్రాంతం అభివృద్ధి చెందుతదని, నా జన్మ ధన్యమవుతదని ఒక ప్రయత్నం చేసిన. తెలంగాణ రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాల భూమి ఉన్నది. కొడంగల్‌లో 1300 ఎకరాల భూమి సేకరించి పారిశ్రామిక వాడను నిర్మించి అభివృద్ధి చేయాలనుకుంటే చిచ్చుపెట్టి లగచర్ల మంటలు పెట్టి, అధికారులను కొట్టించి, కలెక్టర్ మీద దాడి చేయించి, మా లంబాడీ సోదరులను జైలు పాలు చేసింద్రు. నేను ఆయాలనే చెప్పిన, వాళ్ల మాయమాటలు నమ్మొద్దని. సార్ మీరే సీఎం కదా మా మీద కేసులు ఎత్తేయాలని అడుగుతున్నరు.. నేను చెప్పిన మా మిత్రులకు.. సోదరులకు, ముఖ్యమంత్రిగా ఉన్న నామీదనే 182 కేసులు ఉన్నాయి.. నా కేసులే నేను తీసుకోలేకపోయిన.. చట్టం వేరు.. ముఖ్యమంత్రి కుర్సీ వేరు' అని చెప్పి తానేమీ చేయలేనని చెప్పకనే చెప్పారు. 'నేను అడగదలుచుకున్న.. మీ భూములను తీస్కొని నేనేమైనా సాపల సుట్టుకొని పోతనా? నాకేం అవసరం ఉన్నది? ఇయాల 1300 ఎకరాల భూములు తీసుకుంటే నేనేం పట్నం తీస్కపోతనా?' అంటూ ప్రశ్నించారు. 'ఆనాడు నాగార్జునసాగర్ కట్టేటప్పుడు మునుగలేదా.. శ్రీశైలం కట్టేటప్పుడు మా కొల్లాపూర్ మునుగలేదా? పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలు కడుతుంటే కొల్లాపూరోళ్లు ఒక్కసారి కాదు రెండు సార్లు కాదు మూడుసార్లు భూములు కోల్పోయిన బాధను దిగమింగి ప్రభుత్వ సాయం అందించాలని కోరింద్రు గాని అడ్డుపడలేదు.. ఆ రోజే కొట్టాలనుకుంటే మా బిడ్డలు కొట్టకపోతుంటిరా? అధికారుల మీద దాడులు చేయాలంటే శ్రీశైలం వస్తుండెనా? నాగార్జునసాగర్ వస్తుండెనా? జూరాల అయితుండైనా? ఒకవేళ అనుకుంటే నడిగడ్డ మీద ఎవరైనా భూసేకరణ చేస్తుండెనా?' అని బుజ్జగించే ప్రయత్నం చేశారు. 'ముఖ్యమంత్రిగా ఉండి కూడా నా జిల్లాకు ఏమీ చేసుకోకపోతే.. ఈ జిల్లాలో పరిశ్రమలు తేకపోతే.. ఈ జిల్లాకు నీళ్లు, నిధులు ఇవ్వకపోతే.. చరిత్ర నన్ను క్షమిస్తుందా?' అంటూ అసహనం వ్యక్తంచేశారు.

సభలో కుర్చీలాట..

సభలో కుర్చీలాటను చూసి సభికులు నవ్వుకున్నారు. నిర్వాహకులు సీఎంకు, మంత్రులకు, ముఖ్య నేతలకు మాత్రమే మొదటి వరుసలో కుర్చీలు కేటాయించారు. చాలా మంది ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు కుర్చీలు ఏర్పాటు చేయలేదు.

18 సార్లు కేసీఆర్ జపం

సీఎం సొంత జిల్లాలో ఏర్పాటు చేసిన రైతు పండుగలో కూడా రేవంత్‌రెడ్డి 18 సార్లు ప్రత్యక్షంగా పరోక్షంగా కేసీఆర్ పేరును ప్రస్తావించారు. ప్రతి దానికీ కేసీఆర్‌ను అడ్డం పెడుతూ మాట్లాడడంతో జనం పెదవివిరుచుకోవడం కనిపించింది.

జనం వెళ్లిపోతున్నారని లగచర్ల టాపిక్

రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే జనం వెళ్లిపోవడం కనిపించింది. అప్పటివరకు రైతుల గురించి.. రైతు రుణమాఫీ, రైతు బీమా, పంట బోనస్ గురించి మాట్లాడిన సీఎం, జనం వెళ్లిపోవడం చూసి కేసీఆర్‌పై తిట్ల పురాణం అందుకున్నారు. అయినా వాళ్లు ఆగకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

మన జిల్లానే మాదిగోళ్ల జిల్లా కొట్టుర్రి గట్టిగ

'మీ సప్పట్లే వాళ్లకు విజ్ఞప్తి. ఎందుకంటే 70 ఏండ్ల ఆకాంక్ష. ఈ జిల్లాకు నిధులు ఇచ్చేందుకు మంత్రులంతా సంతకం పెట్టే ముందు మన సప్పట్లు వాళ్లకు వినిపించాలె. కొట్టుండ్రి చప్పట్లు బాగా. డప్పు సప్పుడు గట్టిగా వినిపించాలె. మన జిల్లానే మాదిగోళ్ల జిల్లా నయా.. కొట్టుర్రిగట్టిగ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చివర్లో చప్పట్లు కొట్టించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు ఇవ్వాలని, ఈ ఐదేండ్లలో లక్ష కోట్లు ఇచ్చి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని వేదిక మీద ఉన్న మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేసి ఆ తర్వాత ఇలా జనంతో చప్పట్లు కొట్టించారు.

మమ్మల్ని సీఎం అవమానించిండు

- **మాదిగోళ్లు అంటే డప్పులు కొట్టేటోళ్లేనా?**
- **ఆగ్రహం వ్యక్తం చేసిన దళిత సంఘాలు**

రైతు పండుగ సభలో మాదిగోళ్లు డప్పు గట్టిగ కొట్టుర్రి అని మాట్లాడి సీఎం రేవంత్ రెడ్డి తమను అవమానపరిచాడని పలువురు దళిత సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. మాదిగోళ్లు అంటే కేవలం డప్పు కొట్టేవాళ్లేనా అని ప్రశ్నించారు. సీఎం వ్యాఖ్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, ఈ విషయంపై జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సీఎం స్థాయిలో ఉండి దళితులను కించపరిచేలా మాట్లాడటమేమిటని మండిపడ్డారు. ఇప్పటికే రేవంత్ పలు సభలు, సమావేశాల్లో ఐదెకరాల భూమి ఉంటేనే రెడ్డిల మాట వింటరని ఉన్నత వర్గాలకు వత్తాసు పలికారని, ఇప్పుడు దళితులను అవమానపరిచేలా మాట్లాడారని, ఇలా తమ కులాన్ని తక్కువ చేసి మాట్లాడడం ఏమాత్రం భావ్యం కాదని, మరోసారి ఇలా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, కేవీపీఎస్, దండోరా నాయకులు వెల్లడించారు. సీఎం అహంకార పూరిత మాటలు దళితులను మరింత అఘాతంలోకి నెట్టేసేలా ఉన్నాయని పలువురు విద్యావేత్తలు సైతం ఖండించారు.

రైతు భరోసాపై ప్రకటనేది?

- **రైతుపండుగ సభలో ఆ ఊసెత్తని సీఎం రేవంత్‌రెడ్డి**
- **రైతుల కోసం కీలక ప్రకటనలు ఉంటాయన్న మంత్రి తుమ్మల**

హైదరాబాద్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన రైతుపండుగ సభలో తమపై వరాల జల్లు క